## భూ కాలుష్యాన్ని నివారించేందుకు కృషిచేయాలి



హుస్నాబాద్‌టౌన్: నాలుగో వార్డులో తడి, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, జూన్ 26: ప్లాస్టిక్‌తో పెరుగుతున్న భూ కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సిన అవసరం ఉందని మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని నాలుగో వార్డులో తడి, పొడిచెత్తపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడిచెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాల సిబ్బందికి ఇవ్వాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లను వినియోగించడంతో వాతావరణ కాల్యుషం పెరిగి భవిష్యత్ తరాలు ఇబ్బందుల పాలవుతాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అనిత, కమిషనర్ టి. మల్లికార్జున్ గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, వార్డు అధికారి వెంకటేశ్, బేసిల్ ఫౌం డేషన్ వ్యవస్థాపకుడు ఉదయ్, సూపర్‌వైజర్ నవీన్, వార్డు ఆర్పీ శోభ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## 'కొమ్మూరి' భూములను స్వాధీనం చేసుకోవాలి



చేర్యాలలో భూముల వివరాలు వెల్లడిస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, జూన్ 26 : జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆక్రమించిన సర్కారు, భూదాన్,సీలింగ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందే బీరన్న డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని షాదీఖానలో ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో వారు మాట్లాడారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రైతులకు మాయమాటలు చెప్పి తన పేరు, తన కుటుంబ సభ్యుల పేరు మీద పట్టాలు చేయించుకున్నాడని, ఇందులో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ, సీలింగ్, భూదాన్ భూములు ఉన్నాయని, రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్ అధికారులను ప్రలోభపెట్టి రికార్డులు మార్పించి పట్టాభూములుగా మార్చుకోవడం జరిగిందన్నారు. పట్టణంలోని 984,985,987 సర్వే నంబర్లలో వెంచర్ చేసి ప్రజల అవసరాలకు స్థలం కేటాయించలేదని, ఇదే సర్వే నెంబర్‌లోని పెట్రోల్ పంపు పక్కన ఉన్న ఖాళీ భూమిని మున్సిపాలిటీకి అప్పగించాలన్నారు. పట్టణ శివారుకు సంబంధించి సర్వే నెంబర్ 1030లో ఏడు ఎకరాల ఒక గుంట భూదాన్ సీలింగ్ భూమిని ఆక్రమించుకుని అధికారులను లోబర్చుకుని భూదాన్ సీలింగ్ భూమిని పట్టాభూమిగా మార్చుకున్నట్లు తెలిపారు.భూదాన్ సీలింగ్ నిబంధనలకు విరుద్ధంగా పట్టా చేయించుకుని అనుభవిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి పట్టాదారుడిగా అర్హత లేదన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ టౌన్ కార్యదర్శి పోలోజు కుమారస్వామి, నాయకులు ఆలేటి యాదగిరి, బండకింది అరుణ్‌కుమార్, రాళ్లబండి నాగరాజు, ఆముదాల నర్సిరెడ్డి, ముస్త్యాల ప్రభాకర్, పోలోజు శ్రీహరి, రాళ్లబండి భాస్కర్, బోయిన మల్లేశం, ఎర్రబోసు అశోక్, ఆముదాల రంజిత్‌రెడ్డి, రమేశ్, శ్రీకాంత్, కనకయ్య, చంద్రం పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్



ఆటోడ్రైవర్ తిరుపతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బెజ్జంకి, జూన్ 26: మండలంలోని క్రాసింగ్ గ్రామానికి చెందిన కనగండ్ల తిరుపతి అనే ఆటోడ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే బెజ్జంకి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి విధులు ముగించుకుని మంగళవారం సాయంత్రం ఇంటికి వెళ్తుండగా క్రాసింగ్ వద్ద సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. ఫోన్‌ను గమనించిన తిరుపతి ఉపాధ్యాయురాలికి అందించాడు. దీంతో ఆటోడ్రైవర్ తిరుపతి నిజాయితీని అభినందిస్తూ బుధవారం పాఠశాల ప్రధానోధ్యాయుడు వడ్లకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు నారోజు శంకరాచారి, తప్పెట ఓదయ్య శాలువాతో సత్కరించారు.

### రజితోత్సవ వేడుకలకు తరలిరావాలి

సిద్దిపేట టౌన్,జూన్ 26 : శ్రీవైష్ణవ సంఘం 25 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రజితోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర సంఘం నిర్ణయించిందని జిల్లా అధ్యక్షుడు వెంకట రమణాచార్యులు అన్నారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సంఘం రజితోత్సవ బ్రోచర్‌ను అర్చకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కృష్ణమాచారి,గోపీకృష్ణచారి, వంశీకృష్ణాచార్యులు, వెంకటాచార్యులు, రఘునాథచార్యులు, వెంకటనరసింహాచార్యులు, శేషపనింద్రచారి, హరినాథచారి పాల్గొన్నారు.

## వైభవంగా ఆలయాల వార్షికోత్సవాలు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్26: ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో బసవ కల్యాణి పీఠాధిపతి, సిద్దిపేట కోటిలింగ దేవాలయ నిర్మాత మదనానందస్వామి కరకమలములచే 43 ఏండ్ల క్రితం ప్రతిష్ఠించబడిన శివపంచాయతన విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని ఆలయ అర్చకుడు పార్నంది ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్తులు నిర్వహించారు. బెక్కల్ పెద్దమ్మ ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.

**ఘనంగా శివాలయ వార్షికోత్సవం**

సిద్దిపేట టౌన్,జూన్ 26 : సిద్దిపేట పారుపల్లివీధిలోని శివాలయం 34వ వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వహక ధర్మకర్త ఉమాపతి రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు,స్వామి వారికి అభిషేకం,అర్చన నిర్వహించారు.వేడుకల్లో భాగంగా గురువారం శివకల్యాణోత్సవం జరిపించనున్నారు. శుక్రవారం పూర్ణహుతితో ఆలయ ఉత్సవాలు ముగుస్తాయి.

### స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న జయపాల్‌రెడ్డి

వర్గల్,జూన్,26: మండలంలోని మల్లారెడ్డిపల్లిలో బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపసర్పంచుల ఫోరం వర్గల్ మండల మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జయపాల్‌రెడ్డి ఉచితంగా నోట్‌బుక్స్, ఇతర స్టడీమెటీరియల్‌ను అందజేశారు.కార్యక్రమంలో హెచ్‌ఎం నిర్మల, అమ్మకమిటీ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ,గ్రామ యువకులు మహేశ్, కృష్ణ, వినయ్, శ్రీకాంత్, కరుణాకర్, అరుణ్,రాము, యాదగిరి, శ్రీను, భాస్కర్, ప్రకాశ్‌రెడ్డి,బాబు,రవి పాల్గొన్నారు.

### నారుమడిపై అవగాహన



నారాయణరావుపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రమణి

నారాయణరావుపేట, జూన్ 26 : మండల కేంద్రంలోని రైతువేదికలో మండల వ్యవసాయాధికారి రమణి ఆధ్వర్యంలో వరి నారుమడి యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. వరి నారుమడి ఎత్తుగా ఉండేటట్టు చూసుకోవాలన్నారు. ఎకరం నారుమడికి సుమారు 30 నుంచి 40 కిలోల వర్మీకంపోస్ట్, 10 కిలోల వేపపిండి, మూడు కిలోల యూరియా, రెండు కిలోల డీఏపీ, కిలో పొటాష్ కలిపి నారుమడి కోసం దున్నే సమయంలో వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌ను తరిమేద్దాం

**జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం**



గజ్వేల్: మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజ్ఞాపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో బన్సీలాల్, ఏసీపీ పురుషోత్తంరెడ్డి



మర్కూక్: మర్కూక్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు




వర్గల్: వర్గల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



చేర్యాల: చేర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏసీసీ సతీశ్, ఎస్సైలు

మాదకద్రవ్యాలను తరిమేద్దామని పలువురు పోలీసులు పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం జరుపుకొన్నారు. మండల కేంద్రాల్లో విద్యార్థులతో పోలీసులు, ప్రజాప్రతినిధులు ర్యాలీలు తీశారు. పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించారు. మాదకద్రవ్యాల వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉపన్యాస, పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

– సిద్దిపేట జిల్లానెట్‌వర్క్, జూన్ 26



మిరుదొడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై పరశురాములు




హుస్నాబాద్: ర్యాలీలో పోలీస్ అధికారులు, సిబ్బంది



తొగుట: వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ లతీఫ్



బెజ్జంకి: ర్యాలీలో పాల్గొన్న ఎస్సై, విద్యార్థులు




సిద్దిపేట టౌన్: డ్రగ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



దుబ్బాక: విద్యార్థులతో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

## బైకుల చోరీ వ్యక్తికి రిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట సీపీ అనురాధ

- వివరాలు వెల్లడించిన సీపీ అనురాధ

సిద్దిపేట కలెక్టరేట్, జూన్26: రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో బైకులను దొంగతనం చేస్తూ విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. బుధవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. బైక్ చోరీపై సిద్దిపేట పట్టణానికి చెందిన వితకాల రవికుమార్ వన్‌టౌన్ పీఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. బుధవారం ఉదయం సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన కుమ్మరి సాయి కుమార్ అనుమానాస్పదంగా కనపడడంతో అతన్ని పట్టుకొని విచారించగా తొమ్మిది జిల్లాల్లో 19 బైకులు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 2020 నిజామాబాద్ రూరల్ పీఎస్ పరిధిలో ఎనిమిది దొంగతనం కేసులతో పాటు, సుల్తాన్ బజారు, పేట్‌బషీర్‌బాగ్, దుండిగల్ పీఎస్ పరిధిలో దొంగతనాలకు పాల్పడి చంచల్‌గూడ, చర్లపల్లి జైళ్లల్లో శిక్ష అనుభవించి భయటకు వచ్చినట్లు తెలిపారు. అతని వద్ద 19 బైకులు, రూ.45 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నేరస్తుడిని పట్టుకున్న వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, వన్‌టౌన్ ఎస్సై నరసింహారావుకు త్వరలోనే రివార్డు అందజేస్తామన్నారు. సిద్దిపేట ఏసీపీ మధు పాల్గొన్నారు.

## అక్షరజ్యోతి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

కొమురవెల్లి, జూన్ 26 : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అక్షరజ్యోతి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని డీఈవో ఇ.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం కొమురవెల్లి మండలంలోని గురువన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (యూకే) లండన్ అక్షరజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.50వేల విలువగల 10 డిస్క్ బెంచీలను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొజ్జ రాజు ఆధ్వర్యంలో అక్షరజ్యోతి ఫౌండేషన్ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో పి.శ్రీనివాస్‌రెడ్డి, అక్షరజ్యోతి ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వానదేవా..కరుణించవా



ప్రజ్ఞాపూర్ పార్థేశ్వరాలయంలో జలాభిషేకం చేస్తున్న భక్తులు

గజ్వేల్, జూన్ 26: వర్షాలు పడకపోవడంతో రైతులు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో నీళ్లు పోస్తున్నారు. బుధవారం మండలంలోని దాతర్‌పల్లిలో రైతులు ఆలయంలో నీళ్లు పోయగా, పిల్లలు కప్పతల్లి ఆట ఆడారు. గ్రామస్తులు వర్షాలు త్వరగా పడాలని కోరుతూ దేవుడికి పూజలు చేశారు. .

**ప్రజ్ఞాపూర్ శివాలయంలో అభిషేకం**

వర్షాలు సకాలంలో పడాలని కోరుతూ ప్రజ్ఞాపూర్ పార్థేశ్వరాలయంలో మహాశివుడికి జలాభిషేకం చేశారు. మహాశివుడికి పంచామృత అభిషేకాలు, జలాభిషేకాలు నిర్వహించి పంచాక్షరి మంత్రాన్ని పఠిస్తూ వేడుకున్నారు. కార్యక్రమంలో రామకోటి రామరాజు, తుమ్మ శ్రీనివాస్, రమేశ్, మెతుకు నర్సింహులు పాల్గొన్నారు.



మిరుదొడ్డి: అల్వాల గ్రామానికి చెందిన మృతుడి కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్



దుబ్బాకలో పరశురాములు భార్య మౌనికకు రూ.2 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, జూన్ 26 : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అల్వాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఎండీ.నజీర్ ఇటీవల ప్రమాద వశాత్తు మృతి చెందాడు. మృతుడికి పార్టీ సభ్యత్వ బీమా రూ. 2 లక్షల చెక్కును మృతుడి కుటుంబసభ్యులకు బుధవారం అందజేశారు. వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, ఎంపీటీసీ శ్రీనివాస్, కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ.అహ్మద్, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లాల సత్యానారాయణ, మాజీ ఉప సర్పంచ్ దిలీప్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత రాధాకృష్ణ పాల్గొన్నారు.

**పూజలు చేసిన ఎమ్మెల్యే**

అక్బర్‌పేట–భూంపల్లి మండలం మోతెలో రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివ కల్యాణం, రాజ్యశ్యామల యజ్ఞం వంటి పూజలు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సూకురి లింగం పాల్గొన్నారు.

**కార్యకర్తలకు అండగా ఉంటాం**

దుబ్బాక,జూన్ 26: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆకారం గ్రామానికి చెందిన దండబోయిన మౌనికకు బీఆర్ఎస్ తరపున రూ. 2 లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దండబోయిన పరశురాములు నాలుగు నెలల కిందట ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల చెక్కును అందజేశారు కార్యక్రమంలో ఎంపీపీ పుష్పలతాకిషన్‌రెడ్డి, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఆకారం ఎంపీటీసీ పోలబోయిన లక్ష్మీనారా గౌడ్, మాజీ సర్పంచ్ నాగభూషణం పాల్గొన్నారు.

## గంజాయి రవాణా చేస్తున్న నిందితుల అరెస్ట్

రాయపోల్, జూన్ 26 : గంజాయి రవాణా చేస్తున్న నిందితులను అరెస్ట్ చేసినట్లు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు.ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఆయన దౌల్తాబాద్ పీఎస్‌లో వెల్లడించారు. రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన దోనపల్లి రాజు, పిట్ల నవీన్, తొర్రి దర్శన్ ముగ్గురూ కలిసి హైదరాబాద్ నుంచి గంజాయి తీసుకువచ్చి చేగుంట పట్టణ పరిసరాల గ్రామాల్లో విక్రయించి వాటి ద్వారా వచ్చిన డబ్బులను సమానంగా పంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు దౌల్తాబాద్ పోలీసులు ఇందుప్రియాల్ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం ఉదయం వాహనాలు తనిఖీ చేయగా వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గును నిందితులను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో తొగుట సీఐ లతీఫ్,దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్‌దీప్,రాయపోల్ ఎస్సై విక్కుర్తి రఘుపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### 'పచ్చిరొట్ట'తో నేల సారవంతం

మద్దూరు(ధూళిమిట్ట), జూన్26: పచ్చిరొట్ట ఎరువుల వల్ల నేలలు సారవంతంగా మారి అధిక దిగుబడులు వస్తాయని రామద్దూరు మండల వ్యవసాయాధికారి బూరెల రామకృష్ణ అన్నారు. బుధవారం మద్దూరులో జీలుగ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం వల్ల భూసారం తగ్గడంతో పాటు వాతావరణం కలుషితమవుతుందన్నారు.అంతకుముందు మద్దూరు ఫర్టిలైజర్ షాపును ఏవో తనఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

### చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ములుగు, జూన్ 26 : కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన మహిళ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నర్సాపూర్‌లో చోటుచేసుకుంది. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... వర్గల్ మండలం తునికిఖాల్సాకు చెందిన స్వరూప(47) మూడేండ్ల క్రితం తన కొడుకు స్వామి వివాహం తమ సమీప బంధువైన నిఖిలతో జరిపించింది. కొద్దిరోజుల్లోనే కొడుకు, కోడలు మధ్య మనస్పర్థలు వచ్చాయి. కోడలు తమ అమ్మ వాళ్ల ఇంటికి వెళ్లిపోయింది. స్వరూప మంగళవారం ములుగు మండలం సింగన్నగూడలోని తమ బంధువుల ఇంటికి ఓ ఫంక్షన్‌కు వెళ్లింది. అక్కడ తమ బంధువులు కొడుకు,కోడలు సంసారం విషయంపై చర్చించడంతో మనస్తాపానికి గురై బుధవారం నర్సాపూర్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని చెప్పారు.

### ఆలయ వార్షికోత్సవం



గజ్వేల్, జూన్ 26: వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవంలో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ.రాజమౌళి పాల్గొని అభిషేకం చేశారు. బుధవారం గజ్వేల్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేశారు.

### రోడ్లకు మరమ్మతులు చేయాలి

మిరుదొడ్డి, జూన్ 26 : గుంతల మయమైన రోడ్లకు మరమ్మతులు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాగట్ల చందు అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో రోడ్లు బాగు చేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు కనుక మల్లేశం, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

### 13మంది బైండోవర్

మద్దూరు(ధూళిమిట్ట), జూన్26: ధూళిమిట్ట మండలం జాలపల్లి, బైరాన్‌పల్లి గ్రామాల్లోని వాగుల నుంచి అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 13మందిని బుధవారం ధూళిమిట్ట తహసీల్దార్ శ్యామ్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. బైండోవర్ అయిన వారిలో జాలపల్లికి చెందిన బందారం సాగర్, మెతుకు జగన్‌మోహన్‌రెడ్డి, దాసరి రాకేశ్, అల్లాడి రాజు, బైరాన్‌పల్లికి చెందిన బండి బాలరాజు, నందనబోయిన రఘువర్ధన్, నాగిళ్ల గణేశ్, నందనబోయిన నరేశ్, పెర్క సంపత్, బైరి స్వామి, పండుగ కనకరాజు, బత్తిని రాజ్‌కుమార్, పండుగ సాంబరాజు ఉన్నారు. జాలపల్లిలో పోలీసులు సీజ్ చేసిన 150 ట్రాక్టర్ల ఇసుకకు గురువారం వేలం పాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు.

### రేపు ఎంపికలు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్26: క్రీడాపాఠశాల ప్రవేశాల కోసం ఈ నెల 28న(రేపు) మద్దూరు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఉదయ్‌భాస్కర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా పాఠశాలలో నాలుగో తరగతి ప్రవేశాల కోసం 01-09-2015 నుంచి 31-08-2016 మధ్య పుట్టిన విద్యార్థులు అర్హులన్నారు. ఎంపిక కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు తమ ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్లను వెంట తీసుకురావాలన్నారు. వివరాల కోసం మహ్మద్ ఇంతియాజ్ హుస్సేన్ సెల్: 9989132656, దామెర ప్రేమ్‌కుమార్ సెల్: 9000997100 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

### కుటుంబ సభ్యులకు పరామర్శ

హుస్నాబాద్, జూన్ 26: హుస్నాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ రంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుమారుడు సీనియర్ జర్నలిస్టు బొద్దున రవీందర్‌తో పాటు కుటుంబ సభ్యులను బీఎస్పీ నాయకులు బుధవారం పరామర్శించారు. డాక్టర్ రంగయ్య పట్టణానికి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రాజు ఉన్నారు.

### సిద్దిపేటలో అన్నదానం

సిద్దిపేట టౌన్,జూన్ 26 : వనిత క్లబ్ ఆధ్వర్యంలో సిద్దిపేట అభయజ్యోతి మానసిక వికలాంగుల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి, ప్రతినిధులు వీరేశం, రమ్య, సంతోష్‌కుమార్, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### శ్రమదానం చేసిన యువకులు

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 26 : కొండపాక మండలంలోని అంకిరెడ్డిపల్లి నుంచి దుద్దెడ వెళ్లే మార్గంలో హైదరాబాద్ సృజల స్రవంతి అండర్ గ్రౌండ్ వాటర్ పైప్ లైన్ కాల్వను ఆనుకొని అదనపు కాల్వ నిర్మాణం కోసం రోడ్డుకు అడ్డంగాపనులు చేపట్టారు. ఇటీవల కురిసిన వానలకు రోడ్డు కుంగిపోయి గుంతలు ఏర్పడి ఆరోడ్డుపై వెళ్లే ప్రయాణికులు ప్రమాదభారిన పడి గాయాలపాలయ్యారు. బుధవారం ప్రమాదాలకు కారణమైన గుంతలను గుర్తించిన అంకిరెడ్డిపల్లికి చెందిన యువకులు శ్రమదానం చేసి మట్టితో పూడ్చారు.